# ప్రేమ....!



లాయార్ పరంధామయ్య పేపరు చూస్తూ వరండాలో వున్న కుర్చీలో కూచునివున్నారు. చిన్నగా దగ్గిన శబ్దం విని ఎవరా అని చూశారు. ఎదురుగా ఆయన ముద్దుల కొడుకు పదేళ్ళ కిరణ్ నిలబడి వున్నాడు.

"వాట్ మైడియర్ బోయ్ ఏమిటలా నిలబడ్డావు. ఈ రోజు కాన్వెంట్‌కు వెళ్ళ లేదా" అన్నారు. అప్పుడే కాఫీ పట్టుకొచ్చిన మిసెస్ పరంధామయ్య "మీకు మరీ మతి మరుపు ఎక్కువౌతున్నదండి. వాడికి వేసవి సెలవులిచ్చి నాలుగు రోజులవుతోంది" అనేసి లోపలకి వెళ్ళింది.

మెల్లగా కాఫీ సిప్ చేస్తూ "అయితే ఏమిటోయ్ నీ సంగతి అని మరల తండ్రి అడగడంతో కిరణ్‌కు ధైర్యం వచ్చింది. నేను అడిగే ప్రశ్న విని మీరు గెలి చేయరుగా" అంటూ సందేహం వెలిబుచ్చాడు కిరణ్.

పరంధామయ్య "చెప్పు" అన్నారు.

"డాడీ లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటే ఏమిటి."

ఆ ప్రశ్న విన్న పరంధామయ్య గారు ఉలిక్కి పడ్డారు.

అయినా సర్దుకుని మొదటి చూపులోనే ప్రేమించడం అని చెప్పారు.

"ఒరే కిరణ్ నీకు ఎందుకురా ఈవిషయాలు అన్ని తండ్రి మాటలు పట్టించుకోకుండా అయితే నేను ఊహించింది కరెక్టేనన్న మాట. జూలీని నేను ఒకసారి చూడగానే లవ్ చేసాను డాడీ. అబ్బ జూలీ ఎంత అందంగా వుంటుంది డాడీ.

జూలీ నడుస్తుంటే రాణిలా వుంటుంది. ఆ హొయలు, ఆ నడక అబ్బ ఆ కళ్ళు ఎలా మెరిసి పోతాయో. నాకైతే అలానే చూడాలనిపిస్తుంటుంది.

ఈ నాలుగు రోజుల నుంచి నాకు పిచ్చెత్తి నట్టుగా వుంది డాడీ అంటున్న కొడుకు మాటలకు అడ్డు వచ్చారు. పరంధామయ్యగారు

"ఆపరా నీసొద, నీకు జూలీకి ఎంత కాలం నుంచి స్నేహంరా" అని అడిగారు.

"ఎంత కాలమోనా? జూలీ మా కాన్వెంట్‌కు వచ్చి రెండు నెలలవుతుంది. వచ్చినప్పటి నుంచి మాకు జత బాగా కుదిరింది" అన్నాడు సుపుత్రుడు.

పరంధామయ్యగారు విసుగ్గా కిరణ్ వాళ్ళ కాన్వెంట్‌కు ఫోన్ కాల్ బుక్ చేశాడు. లైన్లో వున్న ఆ కాన్వెంట్ ప్రిన్సిపాల్ పరమేశం గారుఫోన్ ఎత్తారు.

"ఏరా! రాస్కెల్ నీకు బుద్ధి వుందా? లేదా? ఏదో బాల్య స్నేహితుడివి కదాని నీ కాన్వెంట్‌లో మా అబ్బాయిని చేర్పినందుకు వాడికి ఇలాంటి చదువా మీరు నేర్పేది. నేలెడు పిల్లలు లేరు ప్రేమలు గురించి మాట్లాడుతున్నారు. నీ కాన్వెంట్‌లో డిసిప్లేన్ లేనందున రికగ్నైజేషన్ తీసి వేయించే దాకా నిద్రపోను" అని ఫోనులో కేకలేస్తున్న స్నేహితుడి మాటలు పరమేశానికి అర్థం కాలేదు.

"ఒరే పరం! ఏమిట్రా నువ్వనేది" అంటున్న స్నేహితుడి మాటలు పరంధామయ్య వినిపించు కోలేదు.

"నీ కాన్వెంట్‌లో ఎవరో జూలీ అట. దాన్ని గురించి మా వాడు తెగపొగుడుతున్నాడు. దాని నడకలో రాణిల హొయలున్నాయట. ఆ కంటి తళ తళలు చూసి తీరాలట. కాబట్టి ఓ గంటలో ఆ జూలీని తీసుకుని నీవు ఇక్కడకు రా" అంటూ ఫోన్ పెట్టేసారు పరంధామయ్య గారు. ఎవరి కండీ ఉదయాన్నే ఫోన్ చేస్తున్నారు. ఈ వాళ కోర్టు కెళ్ళరా? అన్న భార్య మాటలకు ఆయన ఇంతెత్తున ఎగిరిపడ్డారు. నీ సుపుత్రుడు చేసిన నిర్వాకం కళ్ళారా చూద్దువు కాని వుండు అంటూ పేపరు చూడ్డంలో మునిగిపోయారు.

ఆవిడకేమీ అర్థం కాక సణుక్కుంటూ ఇంట్లోకి వెళ్ళింది. కిరణ్‌కు తండ్రి ఎందుకు చిరాకు పడు తున్నాడో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

బిక్కు బిక్కు మంటూ తండ్రిని చూస్తు నిలుచున్నాడు. ఇంతలో కారు హారన్ వినిపించ డంతో పేపరు గిరాటేసి కుర్చీలో సర్దుకుని కూర్చున్నాడు పరంధామయ్యగారు. పరమేశం లోనికి వస్తూ "ఏమిట్రా నీ హడావుడి" అంటూ స్నేహితుణ్ణి కదిపారు. ఆయన వెనకాలే తెల్లని ఆల్సేషియన్ కుక్కపిల్ల అన్నింటినీ వాసన చూస్తూ గబుక్కున కిరణ్ దగ్గరకు వెళ్ళి తోకాడిస్తూ మీదకు ఎగబాకింది. కిరణ్ ఉత్సాహంగా దాన్నెత్తుకుని, "చూసారా డాడీ! జూలీ ఎంత ముద్దొస్తుందో" అంటూ తండ్రి దగ్గరకు వచ్చాడు. పరంధామయ్య గారు ఒకసారి కిరణ్ వంకా, పరమేశం వంకా, జూలీ వంకా చూశారు. ఆయనకేదో అర్థమైంది.

తెరలు తెరలుగా వచ్చే నవ్వును ఆపుకుంటూ స్నేహితుడితో "ఏరా ఈశం మా కిరణ్ చెప్పిన జూలీ ఇదేనా!" అన్నాడు.

"అవున్రా పరం" అని పరమేశం కూడా నవ్వసాగాడు. వీరి నవ్వుల గలగలలకు వంట ఇంట్లో నుంచి కిరణ్ తల్లి బయటకు వచ్చింది. వీరి ద్వారా విషయం విన్న ఆమెకూ నవ్వాగలేదు. అనుకోకుండా జూలీ తన దగ్గరకు రావడంతో కిరణ్‌కూ సంతో షంగా వుంది. నవ్వుతూ కేరింతలు కొడ్తున్నాడు. వీళ్ళు ఎందుకు నవ్వుతున్నారో తెలియని జూలీ బిక్క మొఖం వేసుకుని కిరణ్ ఒళ్ళో నక్కి కూచుంది. పాపం పూర్ జూలీ.

— జి. వల్లీదేవసేన